# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 12 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 5


## వ్యవసాయానికి ప్రత్యేక డిస్కం ఏర్పాటు

● టీజీఆర్‌పీడీసీఎల్ పేరుతో మూడో విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేసింది. "తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్‌పీడీసీఎల్)" పేరుతో ఈ కొత్త డిస్కంను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కొత్త సంస్థ వ్యవసాయ రంగం, సాగునీటి పథకాలు, తాగునీటి సరఫరా వ్యవస్థలకు సంబంధించిన విద్యుత్ పంపిణీ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. టీజీఆర్‌పీడీసీఎల్ కార్యాలయం హైదరాబాద్‌లోని టీజీఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలోని బీ బ్లాక్‌లో పనిచేయనుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు పనిచేస్తున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన టీజీఆర్‌పీడీసీఎల్‌తో రాష్ట్రంలో డిస్కంల సంఖ్య మూడుకు పెరిగింది.

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

● ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్ సింగ్

● సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కార్యక్రమం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. గవర్నర్ బాధ్యతలు స్వీకరించిన శుక్లాకు వారు ఘన స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా శాసనసభ, శాసన మండలి ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

# 108 మంది నక్సలైట్ల లొంగుబాటు

● రూ.3.95 కోట్ల బహుమతి ఉన్న మావోయిస్టులు సరెండర్

● భారీగా నగదు, ఆయుధాల స్వాధీనం

**బలగం టీవీ, జగదల్పూర్**

దేశంలో నక్సలిజం నిర్మూలనకు సాగుతున్న చర్యల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లాలో 108 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై మొత్తం రూ.3.95 కోట్ల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. భద్రతా దళాలకు లభించిన సమాచారం ఆధారంగా మావోయిస్టుల గుప్త నిల్వల నుంచి భారీగా ఆయుధాలు, రూ.3.61 కోట్ల నగదు, సుమారు ఒక కిలో బంగారం (సుమారు రూ.1.64 కోట్ల విలువ) స్వాధీనం చేసుకున్నారు. దేశంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ల చరిత్రలో ఒకే చోట నుంచి ఇంత పెద్ద మొత్తంలో నగదు, విలువైన వస్తువులు స్వాధీనం కావడం ఇదే తొలిసారి అని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్రాజ్ పటిలింగం తెలిపారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు ఉండగా, ఒక్కొక్కరిపై రూ.8 లక్షల బహుమతి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరు మావోయిస్టుల దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీకి చెందినవారని తెలిపారు.

లొంగిపోయిన నక్సలైట్ల సమాచారంతో భద్రతా దళాలు 101 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో ఏకే--47, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ తుపాకులు, లైట్ మెషిన్ గన్స్, .303 రైఫిళ్లు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో భద్రతా చర్యలు, ప్రభుత్వ పునరావాస విధానాల ప్రభావంతో మావోయిస్టులు హింస మార్గాన్ని విడిచిపెట్టి ప్రధాన




ప్రవాహంలోకి వస్తున్నారని అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. గత 26 నెలల్లో ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 2,714 మంది మావోయిస్టులు హింసను విడిచిపెట్టి ప్రధాన ప్రవాహంలోకి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

**ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుంది**

భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడంపై ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ స్పందించారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి ప్రభుత్వం పునరావాసం, భద్రత కల్పిస్తుందని స్పష్టం చేశారు.

గడిచిన 26 నెలల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మొత్తం 2,714 మంది మావోయిస్టులు హింసను విడిచిపెట్టి ప్రధాన ప్రవాహంలోకి వచ్చారని పోలీసులు తెలిపారు. కేవలం బస్తర్ డివిజన్‌లోనే 2024 జనవరి 1 నుంచి 2026 మార్చి 9 వరకు 2,625 మంది లొంగిపోయినట్లు వెల్లడించారు.

## చమురు, ఎల్పీజీ సంక్షోభం లేదు

● వదంతులను నమ్మొద్దు.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

● ప్రధాని మోడీ

● తమిళనాడులో ఎన్నికల సభలో పాల్గొన్న ప్రధాని

**బలగం టీవి, తిరుచిరాపల్లి**

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. వదంతులను నమ్మకుండా, ధృవీకరించిన సమాచారాన్నే పంచుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరిగిన ఎన్డీఏ ఎన్నికల సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, అమెరికా–ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య ఉద్రిక్తతల ప్రభావం గల్ఫ్ ప్రాంతంపై పడిందని, దీంతో ప్రపంచ ఎనర్జీ సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపిందన్నారు. అయితే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలను ఎప్పుడూ ముందుంచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఏ పరిస్థితినైనా దేశం సమర్థంగా ఎదుర్కొంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. డీఎంకే పాలన ఒక కుటుంబానికే పరిమితమైందని, అవినీతి ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకునే విధానంతో పేదలు, మధ్యతరగతి ప్రజల కలలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. తమిళనాడులో మార్పు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధికి కట్టుబడి ఉందని ప్రధాని మోదీ తెలిపారు. అలాగే మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువచ్చినట్లు, తిరుచిరాపల్లి విమానాశ్రయంలో ఆధునిక టెర్మినల్ నిర్మించినట్లు వెల్లడించారు.



**కేరళలో కాంగ్రెస్‌పై విమర్శలు**

కేరళ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి అవగాహన లేదని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అయితే కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాన్ని అపహాస్యం చేయడంలో నిమగ్నమై ఉన్నాయని మోదీ ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలన దేశాన్ని విదేశాలపై అధికంగా ఆధారపడేలా చేసిందని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులను ఆయా దేశ ప్రభుత్వాలు జాగ్రత్తగా చూసుకుంటున్నాయని ప్రధాని తెలిపారు. అక్కడి భారత రాయబార కార్యాలయాలు 24 గంటల పాటు సహాయ సహకారాలు అందిస్తున్నాయని చెప్పారు. అవసరమైన వారికి ఆహారం, వైద్యం, నివాసం, చట్టపరమైన సహాయం కూడా అందిస్తున్నామని వివరించారు. ఇదే సమయంలో కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై కూడా ప్రధాని స్పందించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, అధికార ఎల్‌డీఎఫ్ కూటములపై విమర్శలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఈ రెండు కూటములకంటే బీజేపీ--ఎన్డీఏకు అవకాశం ఇవ్వాలని కోరారు.

## తెలంగాణలో 16 నుంచి వర్షాల సూచన

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న తేమ గాలులు, స్థానిక వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ప్రత్యేకంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. వర్షాల ప్రభావంతో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని కూడా తెలిపారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేత

● దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లీన్ చిట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ కీలక తీర్పు వెల్లడించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు లేవని స్పీకర్ తీర్పులో పేర్కొన్నారు. దీంతో వారిపై దాఖలైన పిటిషన్లు తిరస్కరించబడ్డాయి. ఇదే అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో స్పీకర్ బుధవారం తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది.

## లోక్‌సభ స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

● మూజువాణి ఓటుతో విపక్షాల తీర్మానం తిరస్కరణ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం మూజువాణి ఓటుతో వీగిపోయింది. కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్ విపక్ష ఎంపీల మద్దతుతో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చ జరిగింది. ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ అధ్యక్షతన జరిగిన చర్చలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఓటింగ్‌లో మూజువాణి ఓటుతో విపక్షాల అవిశ్వాస తీర్మానం తిరస్కరించబడింది. అనంతరం లోక్‌సభను గురువారంనాటికి వాయిదా వేశారు.

**సభలో తీవ్ర వాగ్వాదం**

ఓటింగ్‌కు ముందు అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో రాహుల్ గాంధీ ప్రధాని మోదీని కౌగిలించుకుని తర్వాత కన్నుగీటిన సంఘటనను ప్రస్తావించడంతో విపక్ష సభ్యులు తీవ్ర



అభ్యంతరం వ్యక్తం చేశారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

అవిశ్వాస తీర్మానంపై మాట్లాడిన అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ అధికార, ప్రతిపక్షాలకు సమానంగా ప్రాతినిధ్యం వహించే నిష్పాక్షిక వ్యక్తి అని పేర్కొన్నారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం పార్లమెంటరీ రాజకీయాల్లో దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గత 75 ఏళ్ల పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం అరుదుగా మాత్రమే వచ్చినదని తెలిపారు. సభ పరస్పర విశ్వాసంతో నడుస్తుందని, స్పీకర్‌కు రాజ్యాంగం మధ్యవర్తి పాత్రను ఇచ్చిందని చెప్పారు. స్పీకర్ నిర్ణయాలతో అసహనం ఉన్నప్పటికీ సభా నిబంధనలను గౌరవించాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారు.

## ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ అమల్లో అలసత్వం వద్దు



● స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు

● మంత్రి దామోదర్ రాజనర్సింహ

● అధికారులతో మంత్రి సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమల్లో ఎలాంటి అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ కార్యక్రమ పురోగతిపై బుధవారం సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల కోసం గ్రామాల నుంచి మహిళలను ఆసుపత్రులకు తరలించేందుకు, పరీక్షల అనంతరం సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఆసుపత్రుల్లో మహిళలు ఎక్కువసేపు వేచి ఉండకుండా అవసరమైన మేర వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీరు, కూర్చొనే సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. స్క్రీనింగ్ సమయంలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు గుర్తిస్తే వెంటనే చికిత్స ప్రారంభించాలని మంత్రి సూచించారు. రక్త నమూనాల సేకరణ నుంచి ల్యాబ్‌లకు తరలింపు వరకు కోల్డ్ చైన్ ప్రోటోకాల్ పాటించాలని, డేటా నమోదు సమయంలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు.

రాష్ట్రంలో 32 జిల్లాల్లోని 542 మండలాల్లో సుమారు 46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. రక్తహీనత, మధుమేహం, బీపీ, థైరాయిడ్, కాలేయం, కిడ్నీ పనితీరు వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని రెండు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశలో ప్రతి జిల్లాలో ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నారు. అనంతరం మిగిలిన మండలాలకు విస్తరించనున్నారు. లబ్ధిదారుల ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ హెల్త్ రికార్డులు సృష్టించి ఈ–హెచ్ఎంఐఎస్ ప్లాట్‌ఫారమ్‌కు అనుసంధానిస్తారు. పరీక్షల ఫలితాలను ఎస్ఎంఎస్ ద్వారా, అలాగే 'ఈ–ఆరోగ్యం' యాప్ ద్వారా అందించనున్నారు. దీంతో భవిష్యత్తులో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా మహిళలు సులభంగా వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

● వెలుగుమట్ల భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేసిన మంత్రులు

**బలగం టీవి, ఖమ్మం**

వెలుగుమట్ల భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్లు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మల్లన్న, ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెలుగుమట్లలో భూధాన్ భూముల్లో నివసిస్తున్న పేదలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం, అర్హులను గుర్తించి వారికి న్యాయం చేయాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు. కొందరు దళారులు పట్టాలు



ఇప్పిస్తామని చెప్పి పేదలను మోసం చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి పరిశీలన చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తించిందని మంత్రి తెలిపారు. మొత్తం 311 మంది పేదలకు ఇండ్ల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటికే ఇంటి స్థలం ఉన్న మరో 101 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వెలుగుమట్లలో ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేలోపు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిర్మాణాలకు అవసరమైన నీటి సౌకర్యాన్ని వారంలోగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటిన సీపీఐ

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ తన బలాన్ని చాటుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టుల మద్దతు లేకుంటే ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో ఇతర పార్టీలకు స్పష్టమైందని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జాతీయ నేతలు పల్లా వెంకట్ రెడ్డి, కె. నారాయణ పాల్గొన్నారు. తాము పొత్తు ధర్మాన్ని తప్పకుండా పాటిస్తామని, అయితే ఇతర పార్టీలు ఆ బాధ్యతను నిర్వర్తించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తు ధర్మాన్ని పాటించకపోవడంతో ఇతర పార్టీలకు లాభం కలిగిందని, సీపీఐకి మాత్రం ప్రయోజనం లేకపోయిందని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల పొత్తులపై నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పొత్తులు ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇక జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు తమ మాతృపార్టీ అయిన సీపీఐలో చేరాలని కూనంనేని పిలుపునిచ్చారు. ప్రజాబలం లేని కొద్దిమంది చేసే సాయుధ పోరాటాల ద్వారా లక్ష్యాలు సాధ్యం కాదని అన్నారు. ఈ

## స్పీకర్ తీర్పు అత్యంత అప్రజాస్వామికం

● రాహుల్ గాంధీ ఏం సమాధానం చెబుతారు

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**బలగం టీవి, హైదరాబాద్**

స్పీకర్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పైన ఇచ్చిన తీర్పు అత్యంత అప్రజాస్వామికమని, దారుణమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేవలం రాహుల్ గాంధీ ఆడిస్తున్న ఆటలో భాగంగానే తెలంగాణ స్పీకర్ ప్రసాద్ కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ స్పీకర్ పైన రాహుల్ గాంధీ తీవ్రమైన ఒత్తిడి ఉన్నదని, రాహుల్ గాంధీ కూడా రాష్ట్రం నుంచి వస్తున్న అడ్డగోలు సంచుల కట్టల కోసం ఇలాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. శాసనసభ స్పీకర్ చేతుల్లో ఏమీ లేదని, మొత్తం కాంగ్రెస్ పార్టీనే ఈ ఫిరాయింపుల వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్నది ప్రజాస్వామ్యం మరియు భారత రాజ్యాంగంపై దాడి అని, దీని వెనుక ఉన్న ప్రధాన నేరస్థుడు, ఆ నేరపూరిత ఆలోచన రాహుల్ గాంధీదే. ఆయనే అసలు దోషి అన్నారు. ఎందుకంటే ఆయన అనుమతి లేకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గారు ఇంతటి దారుణమైన నిర్ణయం తీసుకునే సాహసం చేయలేరన్నారు.

ఒకవైపు రాహుల్ గాంధీ భారత రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతూ దానికి రక్షకుడినని చెప్పుకుంటూ, బుధవారం రోజున పార్టీ ఫిరాయింపులకు సంబంధించి కాం గ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పైన సమాధానం చెప్పాలన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయంతో రాహుల్ గాంధీ ఒక జోకర్ గా నిలిచిపోయారని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయిస్తే ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్ అని చెప్పిన రాహుల్ గాంధీ, తెలంగాణ వచ్చి న్యాయ పత్రాల గురించి ఉపన్యాసాలు దంచిన రాహు ల్ గాంధీ, ఈరోజు స్పీకర్ తీసుకున్న నిర్ణయం పైన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఒక పార్టీ బీఫారం పైన గెలిచిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బీఫారంతో ఎంపీగా పోటీ చేసిన తర్వాత కూడా ఆ వ్యక్తిని అనర్హుడిగా ప్రకటిం చకుండా, విచారణ పేరుతో సాగదీసి ఆ ఎమ్మెల్యేకు అనుకూ లంగా తీర్పు చెప్పడం అంటే అత్యంత దుర్మార్గం అన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని తిరుగుతూ ఉపన్యాసాలు ఇచ్చే అదే రాహుల్ గాంధీ, తుక్కుగూడలో ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి మాట్లాడారు. ఇది ఆ రాహుల్ గాంధీ చేస్తున్న మూర్ఖపు పని. రాహుల్ గాంధీకి కొంచెమైనా సిగ్గు, గౌరవం ఉంటే దీనికి సమాధానం చెప్పాలి. ఒక పార్టీ బి–ఫారమ్ మీద ఎమ్మెల్యేగా గెలిచి, రాజీనామా చేయకుండానే మరో పార్టీ బి–ఫారమ్ మీద ఎంపీగా ఎలా పోటీ చేస్తారు? అని ప్రశ్నించారు.

స్వతంత్ర భారత చరిత్రలో ఏ స్పీకర్ కూడా ఇంత అద్భుతమైన నిర్ణయం తీసుకోలేదని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. అందుకే మేము వారిని చప్పట్లతో, శాలువాలతో సత్కరించి మా కృతజ్ఞతలు తెలియజేయాలనుకుం టున్నాము. ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఏ బి–ఫారమ్ వాడారు, ఎంపీగా ఏ బి–ఫారమ్ వాడుతున్నారో అక్కడ స్పష్టంగా ఉంది. ఇంత ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించారంటే, ఖచ్చితంగా ఆయనను, అయనను నడిపిస్తున్న కాంగ్రెస్ నేతలను సత్కరించాల్సిందే అని ఎద్దేవా చేశారు. అన్ని సాక్ష్యాలు ప్రజల ముందు ఉన్నప్పటికీ కూడా విచారణ చేయాల్సిన అవసరం ఏముందని, ఆలోచించాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. అందుకే చేసేవి అనైతిక కార్యక్రమాలు, చెప్పేవి నీతులు అన్న తీరుగా రాహుల్ గాంధీ తీరు ఉందని, అందుకే ఆయనను దేశంలోనే అతిపెద్ద జోకర్ అంటున్నానని కేటీఆర్ తెలిపారు. ఇలాంటి రాహుల్ గాంధీ లాంటి జోకర్లకు తెలంగాణ ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

ఇక ఫిరాయింపుల సంస్కృతి గురించి మాట్లాడే నైతిక హక్కు రాహుల్ గాంధీకి గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ లేనే లేదన్నారు. రాహుల్ గాంధీ నాయనమ్మ ఇందిరా గాంధీ హర్యానాలో మొదలుపెట్టిన ఫిరాయింపుల రాజకీయం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు పాకిందన్నారు. 2004లో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో 26 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే, 10 మందిని తీసుకున్నది కాంగ్రెస్ కాదా అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఇక ఫిరాయింపుల అంశం పైన దానం నాగేందర్, కడియం శ్రీహరిలు చేసిన కామెంట్స్ చూస్తే నవ్వు వస్తుందన్నారు. కడియం శ్రీహరి ఈరోజు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడు కానీ, ఎలాంటి పరిస్థితులలో బీఆర్ఎస్ కి వచ్చారు, ఆయనకు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన గౌరవం, పదవులు ఏమిటో ఆయనకు ఆయన ప్రశ్నించుకోవాలన్నారు. కడియం శ్రీహరికి బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయం ఏంటి? ఆయన 2013లో వచ్చినప్పుడు కేసీఆర్ గారు ఆయనను ఎంపీని చేశారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎంను చేశారు. ఆపై ఎమ్మెల్సీని చేశారు. తర్వాత ఎమ్మెల్యేని చేశారు. ఆయన కూతురికి ఎంపీ టికెట్ ఇచ్చారు. ఈ వయసులో ఇలాంటి "మురికి" మాటలు ఎందుకు మాట్లాడుతున్నారు? ఇంత సిగ్గులేకుండా ఎందుకు బతకాలి? మీరు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారు? నేను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నాను, నాయకత్వంతోనే ఉన్నాను అని మీరు చెప్పారు. అందుకే అడుగుతున్నాను, ఈ "థర్డ్ క్లాస్" మాటలు ఎందుకు? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు గురువారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వద్ద నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కావూరి సాంబశివరావుకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కావూరి సాంబశివరావు కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఎదిగి ఐదుసార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1984, 1989, 1998లో మచిలీపట్నం నియోజ కవర్గం నుంచి, 2004, 2009లో ఏలూరు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో కేంద్ర జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## కుళ్లిన మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..

**బలగం టీవీ, హైదరాబాద్**

మంగళ హాట్ పరిధిలోని ఓ దుకాణంలో కుళ్ళిన మాంసాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తినీ మంగళ హాట్ పోలీసులు అరెస్ట్ చేసి సుమారు 300 కేజీల మాంస వ్యర్థాల స్వాధీనం చేసుకున్నారు. మంగళ హాట్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోల్కొండ జోన్ అదనపు డీసీపీ బి. కృష్ణ గౌడ్ వివరాలను వెల్లడించారు. మంగళ హాట్ ఆర్‌కే పేట్, చిస్టి చమన్ దర్గా సమీపంలో అదే ప్రాంతం అమర్ నగర్ కాలనీ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్ అలియాస్ అఫ్రోజ్ ఏ టు జెడ్ గోట్(మేక), అండ్ షిప్(గొర్రె) అఫ్ఫల్స్ అనే దుకాణం నడిపిస్తున్నాడు. కుళ్ళిన మేకల, గొర్రెల అంతరవాయవల మాంసం అమ్ముతున్నాడు. సమాచారం మేరకు మంగళ్‌హాట్ పోలీసులు, గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయు క్తంగా మంగళ్‌హాట్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. తాజా మాంసం అని నమ్మిస్తూ, నిల్వ ఉంచిన కుళ్ళిన మాంసాన్ని విక్రయిస్తు ప్రజలను మోసం చేస్తున్నాడు. గతంలో ఇలాంటి నేరానికి పాల్పడగా, అప్పట్లో జీహెచ్‌ఎంసీ అధికారులు అతడికి జరిమానా విధించారు. అతను అధిక లాభాలకు కర్ణాటక, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాల నుంచి తక్కువ ధరకే మాంసాన్ని సేకరించేవాడు. అలా సేకరించిన మాంసాన్ని డీప్ ఫ్రీజర్లలో, నిల్వ ఉన్న నీటితో నింపిన ప్లాస్టిక్ టబ్బులలో రోజుల తరబడి ఉంచేవాడు. మాంసం కుళ్ళిపోకుండా, దుర్వాసన రాకుండా ఉండేందుకు ఇలా నిల్వ చేస్తూ, వినియోగదారులకు అది తాజా మాంసమని నమ్మించి విక్రయిస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు..

- రాష్ట్రంలో నడుస్తున్నది అంబేద్కర్ రాజ్యాంగం కాదు... కాంగ్రెస్ రాజ్యాంగం..
- కాంగ్రెస్ ద్వంధనీతికి స్పీకర్ తీర్పు నిదర్శనం.
- ప్రజల తీర్పును కాలరాసి కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

దానం నాగేందర్, కడియం శ్రీహరిల అనర్హత అంశంలో స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. స్పీకర్ ఇచ్చిన ఈ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టినట్టేనని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది అంబేద్కర్ రాజ్యాంగం కాదని, కాంగ్రెస్ రాజ్యాంగమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కాలరాసి కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు, తన కూతురిని కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయించి కండువా వేసుకుని తిరిగి చేతి గుర్తుకు ఓటేయమని కోరిన కడియం శ్రీహరికి క్లీన్ చిట్ ఇవ్వడం కాంగ్రెస్ ద్వంద్వనీతికి నిదర్శనమని పేర్కొన్నారు.

నిత్యం రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలును గాలికి వదిలేయడమే కాకుండా, రాజ్యాంగ విలువలను కూడా విస్మరించారని విమర్శించారు. తెలంగాణ నిధుల దోపిడీకి ఇక్కడి అధికారాన్ని కాంగ్రెస్ ఉపయోగించుకుంటోందని అనడానికి ఇంతకన్నా సాక్ష్యం అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఒక ఏటీఎంలా మారిందని, అందుకే రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై, ప్రభుత్వ అరాచకాలపై కాంగ్రెస్ అధిష్ఠానం నోరెత్తడం లేదని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిల అనర్హత విషయంలో స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

## దానం నాగేందర్, కడియం శ్రీహరికి క్లిన్ చీట్ ప్రజా తీర్పునకు అవమానం..

- శాసన వ్యవస్థ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా నిలుస్తుంది..
- మాజీ మార్క్ ఫెడ్ ఛైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపు రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి లకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించినట్టేనని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్క్ ఫెడ్ ఛైర్మెన్ లోక బాపు రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఒక పార్టీ గుర్తుపై ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు తర్వాత అధికారంలో ఉన్న పార్టీలో పనిచేయడం ప్రజల తీర్పును తుంగలో తొక్కినట్టేనని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచినట్టేనని లోక బాపు రెడ్డి విమర్శించారు. అలాగే కడియం శ్రీహరి తన కూతురు కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసినప్పుడు స్వయంగా కాంగ్రెస్ కండువా వేసుకుని ప్రచారం చేయడమే కాకుండా, మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం చేసిన విషయాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూశారని గుర్తు చేశారు.

ఇలాంటి స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ వారికి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థలను అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఉపయోగిస్తున్నారనే వాదనకు బలం చేకూరుస్తుందని ఆయన అన్నారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర దెబ్బ అని, ఈ నిర్ణయంతో స్పీకర్ తన గౌరవాన్ని తగ్గించుకున్నారని లోక బాపు రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలుగా ప్రజల ఓట్లతో గెలిచి తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి బహిరంగంగా చేరినట్టు ఆధారాలు ఉన్నప్పటికీ వారికి క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టేనని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే ఈ తీర్పు శాసన వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలుస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం ఇస్తారని మాజీ మార్క్ ఫెడ్ ఛైర్మెన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లోక బాపు రెడ్డి హెచ్చరించారు.

## తెలంగాణ బిల్లును 'చీకటి రోజు'గా చిత్రీకరించడం అమానుషం..

- మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్



**బలగం టీవీ, హైదరాబాద్**

పార్లమెంటులో తెలుగు దేశం సభ్యులు కృష్ణ దేవరాయలు చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నేపథ్యంలో అనేక త్యాగాల పోరాటాల పలితంగా పార్లమెంట్ లో చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్దంగా తెలంగాణ బిల్లు ఆమోదించిన రోజు చీకటి రోజు గా చిత్రీకరించడం అమానుషం రాజ్యాంగ ఉల్లంఘన, టీడిపి సభ్యున్ని నిలువరించే ప్రయత్నం రాష్ట్రం నుండి ఎన్నికైన కాంగ్రెస్ బిజెపి సభ్యులు చేయకపోవడం దారుణమని అన్నారు. బిఆర్ఎస్ సభ్యులు లేని లోటు పార్లమెంటులో స్పష్టంగా కనబడుతుందని బీజేపీ కాంగ్రెస్ రెండు తెలుగు దేశం చేసిన ఆరోపణకు కట్టుబడి ఉన్నది అని అర్థమవుతుందని అన్నారు. గతంలో ప్రధాన మంత్రి కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను చీకటితో పోల్చడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రాలుగా విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తెలంగాణ కోరుకుంటే రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదు, బీజేపీ కాంగ్రెస్ టీడీపీ పార్టీల తెలంగాణ వ్యతిరేక వైఖరిని ప్రజలు అర్థం చేసుకోవాలని దేవీప్రసాద్ పిలుపునిచ్చారు.

## టీ స్టాళ్ల తొలగింపునకు వ్యతిరేకంగా ధర్నా..

- జనగామ కలెక్టరేట్ వద్ద మహిళలు, ప్రజాప్రతినిధుల నిరసన



**బలగం టీవీ, జనగామ:**

రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలపరచాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా చర్యలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ జనగామ కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కంటైనర్ వనిత టీ స్టాళ్ల తొలగింపుపై మహిళలు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని, ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని లక్ష్యంగా ప్రభుత్వం డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా గతంలో జనగామ జిల్లా మాజీ కలెక్టర్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ప్రభుత్వ పక్షాన మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసి కలెక్టరేట్ కార్యాలయం ముందు కంటైనర్ రూపంలో వనిత టీ స్టాళ్లను ఏర్పాటు చేయించారు.

ఎర్రగుళ్లపహాడ్ కళ్యాణి గ్రామ మహిళా ఐక్య సంఘం మరియు చీటకోడూరు గ్రామానికి చెందిన పాలమాకుల చిన్న మంజుల, పొత్కనూరి విజయలక్ష్మి వంటి మహిళలకు స్థలం కేటాయించి, విద్యుత్ మరియు నీటి సౌకర్యాలు కల్పించి స్వయంగా కంటైనర్ డిజైన్ చేయించి ప్రారంభించారు. ప్రస్తుతం మహిళలు ఆ వ్యాపారాన్ని సజావుగా నడుపుతూ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు.

అయితే ఇటీవల జనగామ జిల్లాకు కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులు జేసీబీలు, డోజర్లు తీసుకువచ్చి కంటైనర్ వనిత టీ స్టాళ్లను తొలగించేందుకు ప్రయత్నించడం తీవ్రంగా ఖండనీయమని స్థానికులు తెలిపారు. ఈ చర్యలు ముఖ్యమంత్రి ఆశయాలకు విరుద్ధమని వారు ఆరోపించారు. సంబంధిత మహిళలు వారు ఇప్పుడిప్పుడే వ్యాపారాన్ని సజావుగా నడుపుతున్న సమయంలో నూతనంగా జనగామ జిల్లాకు కలెక్టర్ గా వచ్చిన సందీప్ కుమార్ ఝా ఉన్నఫలంగా ఈ కంటైనర్ వనిత టీ స్టాల్ లను తొలగించాలని మున్సిపాలిటీ రెవెన్యూ అధికారులను పురమాయించి తొలగింపులకు పాల్పడడం దారుణం ఎంత చెప్పినా వినకుండా జెసిపిలను డోజర్ లను 20 మంది మున్సిపల్ సిబ్బందిని ఐదుగురు రెవెన్యూ సిబ్బందిని కేటాయించి తొలగిస్తున్నారు.

ఈ ఘటనపై తక్షణం ప్రభుత్వం స్పందించి మహిళలకు న్యాయం చేయాలని మూడవ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి కోరారు. మహిళల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బొట్ల శ్రావణ్, బూడిది ప్రశాంత్, కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, మరిపెల వాణి, జేఏసీ నాయకులు మంగళంపల్లి రాజు, తుంగ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు. బాధిత మహిళలు పాలమాకుల చిన్న మంజుల, పొత్కనూరి విజయలక్ష్మి మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయ దిష్టిబొమ్మ దహనం



**బలగం టీవీ, ఖమ్మం:**

ఖమ్మం నగరంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు తెలంగాణ ఉద్యమ కారులు కలిసి టీడీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మెర రామమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మరియు అమరవీరుల త్యాగాలపై అవమానకర వ్యాఖ్యలు చేసిన ఎంపీపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రంపై విషం కక్కుతున్న టీడీపీ నాయకులను ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంపీ లావు కృష్ణదేవరాయ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అమర వీరుల త్యాగాలను,తెలంగాణ ప్రజల పోరాటాన్ని అవమాపరిచిన ఈ లావు కృష్ణదేవరాయ అనే ఎంపి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక ఆంద్రా ఎంపీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై విషం కక్కుతుంటే, అడ్డుకోవల్సిన 16 ఎంపీలు ఏం చేస్తున్నారుని, గాడిద పళ్ళు తోముతున్నరా..? ఇందుకేనా మిమ్ములను పార్లమెంటుకు పంపింది. తెలంగాణ ఆత్మ గౌరవాన్ని కాపాడని ఎంపీలు ఉంటేంది..? లేకుంటేంది? అదే బీఆర్ఎస్ పార్టీ ఎంపి ఒక్కరున్నా.. ఆ ఎంపి అంతు చూసేవారు, పార్లమెంటును స్తంబింప చేసేవారని అన్నారు.

తెలంగాణపై ఒక ఆంధ్రప్రదేశ్ ఎంపీ విమర్శలు చేస్తుంటే రాష్ట్రానికి చెందిన ఎంపీలు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. పార్లమెంట్‌కు పంపిన ప్రజల ఆశలను వారు నెరవేర్చాలని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తున్న చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, మోడి లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, మందడపు శంకర్రావు, బురాన్, ఆసిఫ్ పాషా, ఈదుల రాజేష్, ఆరంపుల వీరభద్రం, బలుసు మురళీకృష్ణ, జడల కళ్యాణ్, నెమలి కిషోర్, కందాల వీరేందర్ గౌడ్, చల్లపల్లి అజయ్ చారి, పోలేపొంగు వెంకట్, కొండలరావు, వజ్రాల రామ్మూర్తి, సాయి, ఆరోను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవంపై ఆంధ్ర ఎంపీ వ్యాఖ్యలు ఖండనీయం

- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం..



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఆంధ్రప్రదేశ్ ఎంపీలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా ఖండనీయమని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా తెలంగాణపై విషం చిమ్మే రాజకీయాలు చేయడం బాధాకరమని అన్నారు. "కోతికి పుండు అయితే గోకినట్టు" ఇంకా తెలంగాణ మీద ఏడుపు గొట్టు రాజకీయాలు ఆపాలని ఆయన సూచించారు. ఏపీకి రావాల్సిన ప్రత్యేక హోదా గురించి అడిగే ధైర్యం లేక ఢిల్లీ పెద్దల వద్ద మోకరిల్లుతున్న నాయకులు ఇప్పుడు తెలంగాణపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని దాసోజు శ్రవణ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవడానికి గతంలో ఎన్నో కుట్రలు చేసిన వారే ఇప్పుడు మళ్లీ అదే రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వందలాది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమైన కుట్రల చరిత్రను ప్రజలు మర్చిపోలేదని అన్నారు.

డిసెంబర్ 9 ప్రకటన నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ఏర్పాటును అడ్డుకునేందుకు పెట్టిన ప్రతి అడ్డంకిపై పార్లమెంట్‌లో బహిరంగ చర్చకు సిద్ధమని దాసోజు శ్రవణ్ సవాల్ విసిరారు. కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న దోపిడీని కూడా దేశం ముందు బయటపెడతామని చెప్పారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని ఆయన ఆంధ్ర ఎంపీలను సవాల్ చేశారు.తెలంగాణ రాజకీయాల్లో 'శిఖండి' పాత్ర పోషిస్తూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్న వారి అసలు స్వరూపాన్ని బయటపెడతామని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. ఇదంతా జరుగుతున్నా తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. లోక్‌సభలో వ్యాఖ్యలు చేసిన ఎంపీలను అక్కడికక్కడే నిలదీయాల్సిందని పేర్కొన్నారు. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ అధికారిక వైఖరా? లేక వారి వ్యక్తిగత అభిప్రాయాలా? అని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. రాష్ట్రాలు విడిపోయినా రెండు ప్రాంతాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తున్నారని, కానీ కొన్ని రాజకీయ పార్టీలు తమ చిల్లర రాజకీయాల కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఎవరైనా తాకితే రాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. మానిన గాయాలను మళ్లీ రేపే ప్రయత్నం చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. "ఖబడ్దార్... తస్మాత్ జాగ్రత్త" అంటూ తెలంగాణ గౌరవాన్ని కాపాడేందుకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# పెండింగ్ సమస్యలపై సెస్ ఉద్యోగుల ఆగ్రహం..

- తక్షణ ప్రమోషన్లు ఇవ్వాలని ధర్నా
- 72 గంటల సమ్మెతో హోరెత్తిన సిరిసిల్ల...




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కో–ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై సొసైటీ (సెస్) పరిధిలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తమ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల పట్టణంలోని సెస్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులతో పాటు జిల్లాలోని 15 మండలాల ప్రతినిధులు, అసిస్టెంట్ హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషనర్ ఉ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్, డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్, సహకార విద్యుత్ పాలక మండలి డైరెక్టర్లకు పలుమార్లు మెమోరాండంలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని తెలిపారు. సెస్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో తక్షణ ప్రమోషన్లు ఇవ్వాలని, కారుణ్య నియామకాల రెగ్యులరైజేషన్ చేయాలని, సేవా సంవత్సరాల ఆధారంగా మానిటరీ బెనిఫిట్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ విధానం అమలు చేయాలని అన్నారు. అలాగే గత 7 నెలలుగా నిలిపివేసిన ఎఫ్ టి ఏ చెల్లింపులను పునరుద్ధరించడంతో పాటు వర్క్ నార్మ్స్ ప్రకారం కొత్త నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భద్రత కోసం నాణ్యమైన రక్షణ పరికరాలు అందించాలని, టీజీఎస్పీడీసీల్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, అసిస్టెంట్ హెల్పర్స్ పేరును జూనియర్ లైన్మన్‌గా మార్చాలని, పెండింగ్‌లో ఉన్న వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సెస్ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇక్కడ రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ చంద్రారెడ్డి, ఎన్పీడీసీల్ కంపెనీ అధ్యక్షులు జి. ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు శేఖర్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కార్యదర్శి రమణ, కరీంనగర్ టౌన్ డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, టౌన్ డివిజన్ సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం ఆగదు..




- రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**

సిపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు విశ్రమించేది లేదని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి. స్థితప్రజ్ఞ స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన "సిపీఎస్ ఉద్యమ సన్నాహక సమావేశం" వందలాది మంది ఉద్యోగుల మధ్య ఉత్సాహంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

"సిపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల సామాజిక భద్రత గాలిలో దీపంలా మారింది. ఉద్యోగుల కష్టార్జితాన్ని రిస్క్‌తో కూడిన షేర్ మార్కెట్లలో పెట్టుబడిగా పెట్టి, రిటైర్మెంట్ తర్వాత వారిని రోడ్డున పడేయడం దారుణం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఊరా అమలు చేయాలి, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం." రిటైర్మెంట్ తర్వాత అటు సర్వీస్ పెన్షన్ లేకపోవడం, ఇటు వైద్య సదుపాయం (జుఊ) వర్తించకపోవడం సిపీఎస్ ఉద్యోగుల పట్ల అత్యంత విచారకరం. వ్యవస్థను బలోపేతం చేసేందుకు జిల్లాలో ప్రతి సి.పి.ఎస్ ఉద్యోగి సంఘంలో సభ్యత్వం పొందాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి విద్య, రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ వంటి అన్ని విభాగాలకు చెందిన వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డా. బాబు, పాత పెన్షన్ సాధన కోసం చేసే ఏ పోరాటానికైనా తాము సిద్ధమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నిసర్ అహ్మద్, రాష్ట్ర నాయకులు సురేందర్ రెడ్డి, రమేష్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

- సావిత్రిబాయి పూలేకు నివాళులు..
- మహిళా శక్తి సమాజ ప్రగతికి మూలాధారం! సమాజాభివృద్ధిలో మహిళలే కీలకం!!
- రాష్ట మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య



**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడలో బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో 115వ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో మహిళా సోదరీమణులతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించి, సీట్ల పంపిణీ చేసి పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ.. మహిళా శక్తి సమాజ ప్రగతికి మూలాధారమని పేర్కొన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉపాధి, క్రీడా రంగాలతో పాటు అన్ని రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. మహిళా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా భావించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

అదేవిధంగా ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జ్ పొలాస నరేందర్ మాట్లాడుతూ.. సమాజంలో సగభాగమైన మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాలను ఆయన కోరారు. బిల్లు అమల్లోకి వస్తే మహిళల్లో మరింత చైతన్యం పెరిగి అన్ని రంగాల్లో పురోగతి సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘసేవకురాలు క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహిళా అభ్యుదయం కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు మారం కుమార్, ఇల్లందుల వెంకటేష్, గాదె శ్రావంతి, మెరుగు జల, బూలక్ష్మి, కళ్యాణి, జ్యోతి, శ్రీనిధి, బాబాయి, చింతల కోటి రామస్వామి గౌడ్, కనపర్తి సుధాకర్, కొణతాల తిరుపతి, తూమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.




# సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

- అప్పారెల్ పార్క్ సందర్శన...

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**

విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న సిద్ధాంతాలను ప్రత్యక్షంగా చూసి అర్థం చేసుకున్నప్పుడే పూర్తిస్థాయి అవగాహన కలుగుతుందని సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. బుధవారం (11-03-2026) రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరులోని అప్పారెల్ పార్క్‌లో గల పంచమేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను వాణిజ్య విభాగం (జశీఎవతీఛవ ఐవజూఖతీఎవత్) ఆధ్వర్యంలో విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్శనలో వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ టి. లావణ్య, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె. శారద విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలలో లభించే ఉద్యోగ అవకాశాలు, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వస్త్రాలను తయారు చేసే విధానం మరియు ఉత్పత్తి అయిన వస్త్రాలను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసే ప్రక్రియల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు.

సంస్థ హెచ్ ఆర్ మేనేజర్ మధు, హెచ్ ఆర్ రోల్ నీలిమ విద్యార్థులకు పరిశ్రమలోని ప్రతి విభాగాన్ని ప్రత్యేకంగా చూపిస్తూ, అక్కడి పనితీరును క్షుణ్ణంగా వివరించారు. ముడి సరుకు నుంచి సిద్ధమైన వస్త్రం వరకు జరిగే ప్రతి దశను విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. ఈ పర్యటన వల్ల పరిశ్రమలో జరిగే వాణిజ్య కార్యకలాపాలపై తమకు స్పష్టమైన అవగాహన వచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వై. నరసయ్య, జి. శ్రీధర్ రావు మరియు పెద్ద సంఖ్యలో బీకాం విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల (అగ్రహారం) లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవ పథకం (చీూూ) ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం (11-03-2026) పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల తరగతి గదులు, ల్యాబ్‌లు, వరండాలను చీూూ వాలంటీర్లు కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి మరియు చదువుకు ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. చీూూ వాలంటీర్ లు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్--2 ప్రోగ్రామ్ ఆఫీసర్ మార్కొండ శకుంతల, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఏ. ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ జి. శ్రీధర్ రావు, డా. ఎస్. కృష్ణ ప్రసాద్, డా. కరుణ, డా. జైపాల్, పూర్వ విద్యార్థి మరియు గర్జనపల్లి సర్పంచ్ రాకేష్ గౌడ్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, NSS వాలంటీర్లు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఎద్దుగుట్ట మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవంలో ఘనంగా ప్రత్యేక పూజలు

- పాల్గొన్న పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి

**బలగం టీవీ, సిరిసిల్ల**

స్థానిక 8వ వార్డులోని ఎద్దుగుట్ట మల్లికార్జున (మల్లన్న) స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు బుధవారం రోజున భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. భక్తుల ఆరాధ్య దైవమైన పెద్దగుట్ట మల్లన్న స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో సంతోషకరమైన జీవితం గడపాలని, పాడిపంటలు, వ్యాపారాలు తదితర రంగాలలో అభివృద్ధి సాధించాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం స్వామివారి నాగవల్లి పట్నాన్ని వీక్షించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఎద్దుగుట్ట మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో కౌన్సిలర్ సభ్యులు లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, దొంతినేని కళ్యాణి అశోక్ రావు, దార్నం అరుణ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మాజీ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, లింగంపల్లి సత్యనారాయణ, భూక్య రెడ్డి నాయక్, పెద్దూరు ఫ్యాక్స్ చైర్మన్ జెల్ల కిషన్ , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దిడ్డి శ్రీనివాస్, దొంతినేని అశోక్ రావు, వార్డ్ అధ్యక్షులు దేవయ్య, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, యాదవ సంఘం నాయకులు, సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌పై బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం దర్యాప్తు..



- 'భాగ్యలక్ష్మి మినరల్స్'పై తీవ్ర ఆరోపణలు

**బలగం టీవీ, హైదరాబాద్**

హిమాయత్ సాగర్ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్, క్రషింగ్ యూనిట్ల గుట్టు రట్టు చేసేందుకు ఏర్పాటైన బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం బుధవారం ఉదయం భాగ్యలక్ష్మి మినరల్స్ క్రషింగ్ యూనిట్‌ను సందర్శించింది. సీఎం రేవంత్ రెడ్డి మేనల్లుడు రమేష్ రెడ్డి అనుయాయులకు చెందినదిగా పేర్కొంటున్న ఈ యూనిట్‌లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. సైట్ విజిట్ అనంతరం మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు, అక్రమ మైనింగ్, క్రషింగ్ యూనిట్ల మూసివేత కోసం కోర్టులతో పాటు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని ప్రకటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, మొన్న మానస హిల్స్ వద్ద మంత్రి పొంగులేటికి చెందిన అక్రమ క్రషింగ్ యూనిట్‌ను పరిశీలించి అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. అక్కడ పరిస్థితులు 'కేజీఎఫ్ సినిమా'లా కనిపిస్తే, ఇక్కడ నియోపోలిస్‌లో సీఎం రేవంత్ రెడ్డి మేనల్లుడి బినామీల వ్యవహారం మరింత పెద్దదిగా ఉందని విమర్శించారు. భాగ్యలక్ష్మి మినరల్స్‌కు సీఎం అనుమతి తప్ప మరే శాఖ అనుమతి లేదని ఆరోపించారు. ఈ యూనిట్ ద్వారా నెలకు రూ.3 నుంచి రూ.4 కోట్ల వరకు ఆదాయం సీఎం మేనల్లుడి జేబుల్లోకి వెళ్తోందని అన్నారు.ట్రిపుల్ వన్ జీవో పరిధిలో చిన్న ఇల్లు నిర్మించుకునేందుకు కూడా అనుమతి ఇవ్వని ప్రభుత్వం, ఇంత భారీగా క్రషింగ్ జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మూడు ఆధునిక క్రషర్లతో గుట్టలను కొల్లగొడుతున్నారని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపించారు. భాగ్యలక్ష్మి మినరల్స్ నుంచి తీసిన కంకరనే చుట్టుపక్కల నిర్మాణాలకు కొనుగోలు చేయాలని సీఎం ఫత్వా జారీ చేశారనే ఆరోపణలు కూడా చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టు తలుపులు తడతామని, గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, భాగ్యలక్ష్మి మినరల్స్ పేరిట 10 ఎకరాలకు అనుమతి తీసుకుని 17 ఎకరాల్లో మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. చట్టం ప్రకారం పోర్టబుల్ రెడీ మిక్స్ యూనిట్‌కే అనుమతి ఉండగా, ఇక్కడ శాశ్వత యూనిట్ నడుస్తోందని అన్నారు. అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు సంపాదిస్తూ సీఎం ఢిల్లీకి మూటలు పంపుతున్నారని విమర్శించారు. అక్రమ క్రషింగ్ యూనిట్లు మూసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్‌కు కిలోమీటర్ లోపల మైనింగ్‌పై నిషేధం ఉన్నప్పటికీ, 500 మీటర్ల దూరంలో కూడా లేని భాగ్యలక్ష్మి మినరల్స్ ఎలా కార్యకలాపాలు కొనసాగిస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా లక్షల క్యూబిక్ మీటర్ల కంకర తవ్వుతున్నారని ఆరోపించారు. వెంటనే ఈ యూనిట్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ పరిసర 84 గ్రామాల్లో ఉన్న అక్రమ క్రషింగ్ యూనిట్ల వివరాలు ప్రభుత్వం వెల్లడించకపోతే తామే బయటపెడతామని హెచ్చరించారు.

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె. కిషోర్ గౌడ్ మాట్లాడుతూ, కేసీఆర్ నీళ్లు--నిధులు--నియామకాల నినాదాన్ని సాకారం చేస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని నీరుగారుస్తోందని విమర్శించారు. నియోపోలిస్‌లో ఎకరం రూ.150 కోట్లకు చేరేలా ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసిన ఆస్తులను ప్రస్తుతం ప్రభుత్వం తన అనుచరులకు కారుచౌకగా కట్టబెడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృంద సభ్యులు గోసుల శ్రీనివాస్ యాదవ్, అభిలాష్ రంగినేని, రాఘవేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల సాధనకు ఐక్యతతో ముందుకు సాగాలి..

- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బిఆర్‌టియూ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మరియు మాజీ ఎంపీ వినోద్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సమావేశంలో ఆశా వర్కర్లు, ఆటో యూనియన్, హమాలీ యూనియన్, పబ్లిక్ సెక్టార్ యూనియన్లు, ఫ్యాక్టరీ యూనియన్లు, ట్యాక్సీ యూనియన్లు, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, స్ట్రీట్ వెండర్స్ తదితర విభిన్న రంగాలకు చెందిన యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేసీఆర్ నాయకత్వంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిపి రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. ఆ పోరాటాలలో చారిత్రాత్మకమైన ఘట్టంగా మిలియన్ మార్చ్ నిలిచిందని గుర్తు చేశారు.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని,



అనంతరం రైతులు, పేదలు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు కార్మికులకు భారంగా మారాయని, వాటిని సవరించి కార్మికుల అభ్యున్నతికి అనుకూలంగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్మికుల పక్షానే నిలుస్తుందని, వారి హక్కులు, భద్రత, భవిష్యత్తు కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్మిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చలు జరిపి, కార్మికుల ఐక్యతను బలోపేతం చేస్తూ వారి హక్కుల సాధన కోసం మరిన్ని కార్యాచరణలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మరియు బిఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, మారయ్య, నారాయణ, దానకర్ణ చారి, హమాలి శ్రీనివాస్, మాయ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపులను ప్రోత్సహించి మంత్రి పదవులు ఇచ్చింది మీరే




- ఎమ్మెల్యే దానం నాగేందర్

**బలగం టీవీ, హైదరాబాద్**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీరును తీవ్రంగా ఖండిస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి పార్టీ మారిన వారికి మంత్రి పదవులు కట్టబెట్టిన సంప్రదాయాన్ని మొదలుపెట్టింది మీరేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. బుధవారం స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశానికి తనను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముఖ్యమంత్రి పదవి పోయినందుకు పెద్దగా ఇబ్బంది లేదని, అయితే ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడంతో కేటీఆర్‌కు మాత్రం ఎక్కువ ఇబ్బంది ఉన్నట్లుగా కనిపిస్తోందని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆయన నివాసం వద్ద అనుచరులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. ప్రజల మనిషి దానం నాగేందర్‌కు ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ నాయకులు శ్రీనివాస్ యాదవ్, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజా తీర్పుకు అవమానం..

- స్పీకర్ నిర్ణయం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య,
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్?:**

పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తి ని అపహాస్యం చేసినట్టే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఒక పార్టీ గుర్తుపై ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు తర్వాత అధికారంలో ఉన్న పార్టీలో పనిచేయడం ప్రజల తీర్పును తుంగలో తొక్కినట్టేనని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ కు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచి, ప్రజల తీర్పును పూర్తిగా అవమానించినట్టేనని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.

కడియం శ్రీహరి కూతురు కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేసిన విషయం అందరికీ తెలిసిందే అని గుర్తుచేశారు.కడియం శ్రీహరి స్వయంగా కాంగ్రెస్ కండువా వేసుకుని తన కూతురు తరపున ఎన్నికల ప్రచారం చేయడమే కాకుండా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ బీఫామ్‌పై పోటీ చేసిన అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం చేసిన విషయం ప్రజలు ప్రత్యక్షంగా చూశారని తెలిపారు. ఇలాంటి స్పష్టమైన పరిస్థితుల్లో కూడా వారికి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థలను అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఉపయోగిస్తున్నారనే వాదనకు బలం చేకూరుస్తుందని అన్నారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర దెబ్బ అని, స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన గౌరవాన్ని తగ్గించుకున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలుగా ప్రజల ఓట్లతో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి బహిరంగంగా చేరినట్టు ఆధారాలు ఉండగా దానికి స్పీకర్ క్లీన్ చీట్ ముద్ర వేయడం ప్రజాస్వామ్యం పై దాడి చేయడమేనని, ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే ఈ తీర్పు శాసన వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం ఇస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు.



## జిందం కళా చక్రపాణికి వార్డు శాఖ అధ్యక్షుల శుభాకాంక్షలు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

పురపాలక సంఘం అధ్యక్షురాలిగా రెండవసారి ఎన్నికైన పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి ని బుధవారం రోజున భారత రాష్ట్ర సమితి పార్టీ వార్డు శాఖ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువాతో సత్కారం చేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని అభినందిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 15న హనుమకొండ--వరంగల్‌లో హమాలీ మహాగర్జన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




తెలంగాణ రాష్ట్రంలో లోడింగ్--అన్‌లోడింగ్ పనులు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు మార్చి 15న హనుమకొండ--వరంగల్ పట్టణంలో హమాలీ మహాగర్జన నిర్వహించనున్నట్లు తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

తెలంగాణలో సుమారు 10 లక్షల మందికి పైగా హమాలీ కార్మికులు మార్కెట్ యార్డులు, పెస్టిసైడ్ గోదాములు, సిమెంట్ గోదాములు, ధాన్యం సేకరణ కేంద్రాలు మరియు ఇతర వ్యాపార స్థలాల్లో కష్టపడి పనిచేస్తున్నప్పటికీ వారి జీవితాల్లో పెద్దగా మార్పు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని నాయకులు పేర్కొన్నారు. కఠినమైన శారీరక శ్రమ కారణంగా కార్మికులు చిన్న వయసులోనే అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు హమాలీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని, "సమాన పనికి సమాన వేతనం" అమలు కాలేదని వారు ఆరోపించారు. ఇటీవల యంత్రాల వినియోగం పెరగడం వల్ల కార్మికుల మధ్య పోటీ పెరిగి, వారికి లభించే వేతనాలు తగ్గుతున్నాయని కూడా చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందనే విశ్వాసంతో, హమాలీ కార్మికుల హక్కుల కోసం తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. యూనియన్ బలోపేతం చేయడం, కార్మికుల సమస్యలను ప్రభుత్వానికి మరియు ప్రజలకు తెలియజేయడం కోసం ఈ మహాగర్జన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హమాలీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ అన్నాడి వెంకట్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా బాధ్యులు జంగా సంపత్ యాదవ్, జిల్లా కార్యదర్శి కామ భూమయ్య, కరీంనగర్ జిల్లా బాధ్యులు కొమ్ము మధుకర్, సిరిసిల్ల జిల్లా బాధ్యులు ఎడ్ల విశాన్, సిరిసిల్ల హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు నగునూరి భాను, ఉపాధ్యక్షులు కులిపురం రమేష్, కోశాధికారి గడ్డి దేవయ్య హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

